# చార్టెర్డ్ అకౌంటెంట్!

**ఇంజినీరింగ్, మెడికల్, కంప్యూటర్ కోర్సులకు దీటుగా ఉద్యోగానికి ధీమా ఇచ్చే ప్రొఫెషనల్ కోర్సులు... చార్టర్డ్ అకౌంటెంట్, ఐసీడబ్ల్యూఏ, సీఎస్. ఇంటర్‌లో చదివిన గ్రూప్‌తో నిమిత్తం లేకుండా ఎవరైనా ఈ కోర్సులు చదివే వీలున్నప్పటికీ.. కామర్స్ విద్యార్థులకు ఈ కోర్సులు ఎంతో సౌలభ్యంగా ఉంటాయి.**

## చార్టెర్డ్ అకౌంటెన్సీ (సీఏ)

**అర్హత:** ఇంటర్మీడియెట్ పరీక్షలో ఉత్తీర్ణత

**కౌన్సిల్:** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ)

**నమోదు:** సంవత్సరమంతా

**కనీస కాల వ్యవధి:** 4-5 సంవత్సరాలు

**పరీక్షలు:** మే-జూన్, నవంబర్-డిసెంబర్

**వెబ్‌సైట్:** www.icai.org

ఏ సంస్థకైనా అవసరయ్యే విభాగం ఆడిటింగ్. ఆ విధులు నిర్వర్తించాలంటే.. సి.ఎ. తప్పనిసరి! అటువంటి చార్టెడ్ అకౌంటెన్సీ... సర్టిఫికెట్ కోర్సుకు ఇంటర్‌తోనే పునాది వేసుకోవచ్చు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఈ కోర్సును అందిస్తోంది. ఈ సంస్థకు దేశ వ్యాప్తంగా సుమారు 117 బ్రాంచిలు న్నాయి. ఈ కోర్సులో మొత్తం మూడు దశలున్నాయి. అవి..

- కామన్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ (సీపీటీ)
- ఇంటిగ్రేటెడ్ ప్రొఫెషనల్ కాంపిటెన్స్ కోర్సు (ఐపీసీసీ)
- ఫైనల్ కోర్సు

### కామన్ ప్రొఫిషియన్సీ టెస్ట్

పదో తరగతి పూర్తవగానే ఈ టెస్ట్ కోసం పేరు నమోదు చేసుకోవాలి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు పూర్తయ్యాక సీపీటీ పరీక్ష రాయడానికి అర్హత లభిస్తుంది. ఏటా జూన్, డిసెంబర్ నెలల్లో సీపీటీ ఉంటుంది. మన రాష్ట్రంలో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలలో... ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెన్సీ ఆఫ్ ఇండియా శాఖలు ఉన్నాయి. ఆ బ్రాంచ్‌లలో సీపీటీ కోసం పేరు నమోదు చేసుకోవచ్చు.

**పరీక్ష:** మొత్తం రెండు విభాగాలుగా... నాలుగు సబ్జెక్టుల్లో 200 మార్కులకు ఈ పరీక్ష జరుగుతుంది.

సెక్షన్ -1

**సెక్షన్ ఎ:** ఫండమెంటల్స్ ఆఫ్ అకౌంటింగ్ (60 మార్కులు)

సెక్షన్ బి: మర్కంటైల్ లా (40 మార్కులు)

సెక్షన్– 2

**సెక్షన్ సి:** జనరల్ ఎకనామిక్స్(50 మార్కులు)

**సెక్షన్ డి:** క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (50 మార్కులు) పరీక్ష మొత్తం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కులు ఉంటాయి.

## ఇంటిగ్రేటెడ్ ప్రొఫెషనల్ కాంపిటెన్సీ కోర్సు (ఐపీసీసీ)

సీపీటీలో ఉత్తీర్ణులైనవారు ప్రొఫెషనల్ కాంపిటెన్స్ కోర్సు (ఐ.పి.సి.సి.)కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ దశ లో రెండు గ్రూపులు ఉంటాయి. గ్రూపు–1లో 4 సబ్జెక్టులు, గ్రూప్–2లో మూడు సబ్జెక్టులు ఉంటాయి. వాటిలో ఒక గ్రూప్‌లో పాసైనా ఫైనల్ కోర్సుకు అర్హత పొందవచ్చు.

## ఫైనల్ కోర్సు

ప్రొఫెషనల్ కాంపిటెన్సీ కోర్సులోని ఏదైనా ఒక గ్రూపులో అర్హత సాధించినవారు ఫైనల్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ దశలో చార్టర్డ్ అకౌంటెంట్ దగ్గర ఆర్టికల్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఈ దశలో రెండున్నర సంవత్సరాలు పూర్తయిన తర్వాత పి.సి.సి. ఫైనల్ గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలు రాయాలి. మిగిలిన ఆర్నెల్లలో ఆర్టికల్‌షిప్‌ను పూర్తి చేయాలి. ఫైనల్ పరీక్షలో సర్టిఫికెట్ పొందిన తర్వాత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెట్స్ ఆఫ్ ఇండియాలో సభ్యుడిగా రిజిస్టర్ చేసుకోవాలి. దాంతో చార్టర్డ్ అకౌంటెంట్ (సి.ఎ.)గా పూర్తి అధికారిక హోదా లభిస్తుంది.

## అవకాశాలెక్కడ..

సీఏ పూర్తి చేసిన అభ్యర్థులకు అకౌంటింగ్, ఆడిటింగ్, కాస్ట్ అకౌంటింగ్, టాక్సేషన్, ఇన్‌వెస్టిగేషన్, కన్సల్టెన్సీ విభాగాల్లో అవ కాశాలు పుష్కలంగా ఉంటాయి.

## సీఏలు ఏం చేస్తారు

ఏ సంస్థలోనైనా ప్రధాన విభాగాలు అకౌంటింగ్, ఆడిటింగ్, టాక్సేషన్. వాటి గురించి వివరించేదే చార్టెర్డ్ అకౌంటెంట్. కంపెనీలు, వ్యక్తుల టాక్స్ ప్లానింగ్ విషయంలో సీఏ అవసరం తప్పనిసరి. అంతే కాకుండా పెట్టుబడులు, వాటి ప్లానింగ్, సంస్థాగత అభివృద్ధి, కొత్త ప్రాజెక్టు రూపకల్పన, నిర్వహణలో సాధ్యాసాధ్యాలు, ఆర్థిక వనరుల సమీకరణ, జాయింట్ వెంచర్స్, విదేశీ భాగస్వామ్యాలు, విస్తరణ, విలీనాల్లోనూ, ఉత్పత్తుల ధరలు, బీపీఓ మొదలైన వాటిలో సీఏ కీలక పాత్ర పోషిస్తాడు.

## వేతనాలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ)లో మార్చి–ఏప్రిల్ 2009లో జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో మూడు నుంచి తొమ్మిది లక్షల రూపాయల వరకు వార్షిక వేతనాన్ని కంపెనీలు ఆఫర్ చేశాయి. అంతర్జాతీయ స్థాయిలో ఎంపికయిన వారికి అత్యధికంగా రూ. 23 లక్షల వార్షిక వేతనాన్ని ఆఫర్ చేశారు.

## సీఏకు ఉండాల్సిన స్కిల్స్:

- మంచి విశ్లేషణాత్మక నైపుణ్యాలు
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్
- నిరంతర పఠనాభిలాష
- వ్యూహాత్మక మేనేజ్‌మెంట్ సామర్థ్యాలు
- నిజాయితీ
- లెక్కలు, ఫైనాన్స్‌పై ఆసక్తి
- పనిలో ఏకాగ్రత, అంకితభావం

## లాభ నష్టాలు

- సీఏ కావాలనుకుంటే పెద్దగా ఖర్చు కూడా చేయనవసరం లేదు.
- సీఏ కావాలనుకునేవారు అవసరాలకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలు పెంచుకోవాలి.
- ఒక్కసారే ఫైనల్ పూర్తి చేయడం అంత సులువు కాదు.

అకౌంటెన్సీ అండ్ ఫైనాన్స్‌లో ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ స్పెషల్ బీకామ్ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తోంది. ఈ కోర్సులో చేరినవారికి సీఏలో కొన్ని సబ్జెక్టుల నుంచి మినహాయింపు లభిస్తుంది. సీఏ ఫైనల్ దరఖాస్తు చేసుకున్నవారి కోసం ఎంకామ్ కోర్సును కూడా ఇగ్నో ఆఫర్ చేస్తోంది.

వెబ్‌సైట్: www.ignou.ac.in

## సీఏ పూర్తి చేసిన తర్వాత స్పెషలైజేషన్లు..

- డిప్లొమా ఇన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆడిట్ (డీఐఎస్ఏ)
- సర్టిఫైడ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఆడిటర్ (సీఐఎస్ఏ)
- డిప్లొమా ఇన్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ (డీఐఆర్ఎమ్)
- చార్టర్డ్ ఫైనాన్షియల్ అకౌంటెంట్స్
- డిప్లొమా ఇన్ టాక్స్ మేనేజ్‌మెంట్ (డీఐటీఎమ్)
- ఇండియన్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టాండర్డ్స్(ఐఎఫ్ఆర్ఎస్)
- చార్టర్డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ (సీఐఎమ్ఏ)

## ప్రముఖ సీఏ కోచింగ్ సెంటర్లు

- విజయవాడలోని సూపర్‌విజ్
- దిగ్విజయ్ ఇన్‌స్టిట్యూట్, గాంధీనగర్
- తపస్య ఇన్‌స్టిట్యూట్, లక్డీకపూల్
- సీఎమ్ఎస్ ఇన్‌స్టిట్యూట్, ఎస్ఆర్ నగర్
- జయరామన్ ఇన్‌స్టిట్యూట్, మల్కాజ్‌గిరి

- కల్యాణ్ చక్రవర్తి ఇన్‌స్టిట్యూట్, అమీర్‌పేట
- విజయవాడలోని శ్రీ మేధ

## సీఏలకు జాబ్స్ ఇచ్చే ప్రధాన రంగాలు

- బ్యాంకింగ్
- ఫైనాన్షియల్ సర్వీసెస్
- ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-సాఫ్ట్‌వేర్
- మైనింగ్
- ఆయిల్ అండ్ గ్యాస్ రిఫైనింగ్
- చార్టర్డ్ అకౌంటెన్సీ సంస్థలు
- ఐరన్ అండ్ స్టీల్
- హెవీ ఇంజనీరింగ్
- ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్స్ట్రక్షన్

## ఐసీఏఐ ప్లేస్‌మెంట్స్ (2010)

పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు: 2,931

ఆఫర్లు అందుకున్నవాళ్లు: 1,411

ఆఫర్లు అంగీకరించనివారు: 1170

**టాప్ రిక్రూటర్స్:**

- ఐసీఐసీఐ
- జెన్‌ప్యాక్ట్
- ఇన్ఫోసిస్ టెక్నాలజీస్ లిమిటెడ్
- ఎస్‌బీఐ
- డెలాయిట్
- కోల్ ఇండియా లిమిటెడ్

**జీతాలు:**

- యాక్సిస్ బ్యాంక్ - 10.82 లక్షలు
- ఐటీసీ లిమిటెడ్ - 10.61 లక్షలు
- బీపీసీఎల్ - 9.5 లక్షలు

# కంపెనీ సెక్రటరీ కావాలంటే..

**కోర్సు:** కంపెనీ సెక్రటరీ(సీఎస్)

**అర్హత:** 10+2/గ్రాడ్యుయేషన్

**ఇన్‌స్టిట్యూట్ అండ్ ప్రొఫెషనల్**

**కౌన్సిల్:** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ)

**కనీస కాలవ్యవధి:** రెండున్నర సంవత్సరాలు (గ్రాడ్యుయేషన్ తర్వాత), మూడున్నర సంవత్సరాలు (10+2 తర్వాత)

**పరీక్ష:** మూడు దశలకూ ఏటా జూన్-డిసెంబర్

**ఫీజు:** రూ. 200 (ప్రాస్పెక్టస్ అండ్ దరఖాస్తు పత్రం)

**వెబ్‌సైట్:** www.icsi.edu

కంపెనీల్లో కీలకమైన హోదాల్లో కంపెనీ సెక్రటరీ(సీఎస్) ఒకటి. ఆ ఉద్యోగం పొందాలంటే... కంపెనీ సెక్రటరీ కోర్సు పూర్తి చేయాలి. ఇంటర్ నుంచే ఆ దిశగా పయనించే మార్గమున్న ఈ కోర్సును ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా మూడు దశల్లో నిర్వహిస్తోంది. సైన్స్, కామర్స్‌తోపాటు ఆర్ట్స్ విద్యార్థులు కూడా ఈ కోర్సులో చేరొచ్చు. ఫౌండేషన్, ఎగ్జిక్యూటివ్, ప్రొఫెషనల్.. అని మూడు దశలుంటాయి. ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ పాసైనవారు చివరి రెండు దశలు పూర్తిచేస్తే సరిపోతుంది. ఎగ్జిక్యూటివ్, లేదా ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ పూర్తయ్యాక ఏదైనా కంపెనీలో సీఎస్ పర్యవేక్షణలో 16 నెలల శిక్షణ పూర్తిచేసుకోవాలి.

**ఫౌండేషన్ ప్రోగ్రామ్:**

10+2 పూర్తి చేసినవారు ఈ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. దీనిలో నాలుగు పేపర్లు ఉంటాయి. ఇంగ్లిష్ అండ్ బిజినెస్ కమ్యూనికేషన్, ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, ఫైనాన్షియల్ అకౌంటింగ్, ఎలిమెంట్స్ ఆఫ్ బిజినెస్ లాస్ అండ్ మేనేజ్‌మెంట్. ఈ కోర్సు కనీస కాల వ్యవధి ఎనిమిది నెలలు.

**ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్:**

సి.ఎస్. ఫౌండేషన్ కోర్సు పాసైనవారు లేదా గుర్తింపు పొందిన ఏదైనా యూనివర్సిటీ నుంచి డిగ్రీ (ఫైన్ ఆర్ట్స్ మినహా) పూర్తి చేసినవారు నేరుగా ఈ ప్రోగ్రామ్‌కు పేరు నమోదు చేసు కోవచ్చు. కనీస కాల వ్యవధి ఏడాది. దీనిలో ఒక్కో దానిలో మూడు పేపర్లు కలిపి రెండు మాడ్యూల్స్‌లో ఆరు పేపర్లు చదవాల్సి ఉంటుంది.

**ప్రొఫెషనల్ ప్రోగ్రామ్:**

ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ పాసైన వెంటనే ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌కు పేరు నమోదు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్ కనీస కాల వ్యవధి ఏడాది ఉంటుంది. ఒక్కో దానిలో రెండు చొప్పున మొత్తం నాలుగు మాడ్యూ

ల్స్‌లో కలిపి ఎనిమిది పేపర్లు చదవాల్సి ఉంటుంది. ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ పూర్తయిన తర్వాత కంపెనీలోగానీ లేదా కంపెనీ సెక్రటరీ వద్దగానీ 16 నెలల శిక్షణ పొందాల్సి ఉంటుంది. తర్వాత మెంబర్‌షిప్‌కు అర్హత లభిస్తుంది.

**అడ్మిషన్:**

ఈ కోర్సు పరీక్షలను ప్రతి ఏటా డిసెంబర్, జూన్‌ల్లో నిర్వహిస్తారు. మార్చి 31లోపు నమోదు చేసుకుంటే.. డిసెంబర్‌లో జరిగే పరీక్షలు రాయడానికి వీలుంటుంది. సెప్టెంబర్ 30లోపు నమోదు చేసుకుంటే తర్వాతి ఏడాది జూన్‌లో జరిగే పరీక్షలకు హాజరయ్యేందుకు అనుమతి లభిస్తుంది. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే... ప్రొఫెషనల్ ఎగ్జిక్యూటివ్ కోర్సుకు నమోదు చేసుకోవచ్చు. విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవడానికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా చాప్టర్‌లలో సంప్రదించాలి. మన రాష్ట్రంలో హైదరాబాద్, విశాఖపట్నంలలో చాప్టర్లు ఉన్నా యి. కంపెనీ సెక్రటరీ కోర్సు పూర్తి చేసినవారు క్యాపిటల్ మార్కెట్, ఇన్వెస్టర్ రిలేషన్స్ తదితర విభా గాల్లో కంపెనీ సెక్రటరీలుగా చేరవచ్చు. సొంతంగా ప్రాక్టీస్ పెట్టు కోవచ్చు.

**సీఎస్‌లు ఏం చేస్తారు:**

సంస్థల లీగల్, రెగ్యులేటరీ వ్యవహారాలు నిర్ణీత సమయంలో పూర్తయేట్లు చూడాల్సిన బాధ్యత కంపెనీ సెక్రటరీపై ఉంటుంది. షేర్‌హోల్డర్ల సమా వేశాలు, డైరెక్టర్ల మీటింగ్‌లపుడు పాలనా అంశాలపై కంపెనీ బోర్డును గైడ్ చేయాల్సి ఉంటుంది. కంపెనీ బోర్డుకు, స్టాక్ హోల్డర్స్‌కు మధ్య సంబంధాల్లో సీఎస్‌ల పాత్ర కీలకం.

**వేతనాలు:**

- ఆర్థిక మాంద్యం నేపథ్యంలోనూ ఫ్రెష్ సీఎస్‌లు మూడు నుంచి నాలుగు లక్షల రూపాయల వార్షిక వేతనాన్ని పొందుతున్నారు.
- నాలుగు లేదా ఐదేళ్ల అనుభవం ఉన్నవారికి భారీ కార్పొరేట్ సంస్థల్లో, మల్టీ నేషనల్ కంపెనీల్లో 25 లక్షల నుంచి కోటి రూపాయల వేతనం ఆఫర్ చేస్తున్నారు.

**స్కిల్స్:**

- మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ (రాయడం, మాట్లాడటంలోనూ)
- అనలిటికల్ అండ్ డెసిషన్ మేకింగ్ ఎబిలిటీ

**ఇన్‌స్టిట్యూట్‌లు:**

- ఐసీఎస్ఐ
- ఐసీఎస్ఐ విద్యార్థులు, సభ్యుల కోసం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ మేజర్ ఇన్ కార్పొరేట్ అఫైర్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్‌లో స్పెషల్ బీకామ్ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తోంది. బిజినెస్ పాలసీ అండ్ కమ్యూనికేషన్ ఎంకామ్‌ను కూడా ఆఫర్ చేస్తోంది.
- వెబ్‌సైట్: www.ignou.ac.in

# కాస్ట్ అకౌంటెంట్స్...

## కోర్సు : ఐసీడబ్ల్యూఏఐ

**అర్హత:** 10+2

**పరీక్ష:** పరీక్షలు ప్రతి సంవత్సరం జూన్, డిసెంబర్‌లలో జరుగుతాయి.

**వెబ్‌సైట్:** www.icwai.org

కంపెనీ లావాదేవీల నిర్వహణలో ఆదాయ, వ్యయ లెక్కింపులో నిపుణులైన అకౌంటెంట్లు అవసరం. అటువంటి వారిని తీర్చిదిద్దే ఉద్దేశంతో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీడబ్ల్యూఏఐ) మూడు దశల్లో ఐసీడబ్ల్యూఏఐ కోర్సును నిర్వహిస్తోంది. అవి.. ఫౌండేషన్, ఇంటర్మీడియెట్ కోర్సు; ఫైనల్ కోర్సు.

## దరఖాస్తు

సంవత్సరంలో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షలు ప్రతి సంవత్సరం డిసెంబరు, జూన్‌లో జరుగుతాయి. శిక్షణ సమయం 6 నెలలు. డిసెంబర్‌లో పరీక్షలకు హాజరు కావాలనుకుంటే ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు కోచింగ్ తీసుకోవాలి. జూన్‌లో పరీక్షలు రాయాలనుకుంటే అక్టోబరు నుంచి మార్చి వరకు శిక్షణ తీసుకోవాలి.

## ఫౌండేషన్ కోర్సు

10+2 పూర్తి చేసిన అభ్యర్థులు ఫౌండేషన్ కోర్సులో చేరవచ్చు. వయసు 17 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో మొత్తం నాలుగు పేపర్లుంటాయి. ఆర్గనైజేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఫండమెంటల్స్, అకౌంటింగ్, ఎకనమిక్స్ అండ్ బిజినెస్ ఫండమెంటల్స్, బిజినెస్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్.

## ఇంటర్మీడియెట్ కోర్సు

ఫౌండేషన్ కోర్సు పూర్తి చేసిన 10+2 అభ్యర్థులు ఇంటర్మీడియెట్ కోర్సులో చేరవచ్చు. లేదా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో ఒక్కోదానిలో మూడు పేపర్లు చొప్పున రెండు గ్రూపులు ఉంటాయి.

**గ్రూప్-1..**

ఇందులో ఫైనాన్షియల్ అకౌంటింగ్, కమర్షియల్ అండ్ ఇండస్ట్రియల్ లాస్ అండ్ ఆడిటింగ్, అప్లైడ్ డైరెక్ట్ టాక్సెస్ సబ్జెక్టులుంటాయి.

**గ్రూప్-2..**

ఇందులో కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, ఆపరేషన్ మేనేజ్ మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, అప్లయిడ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ సబ్జెక్టులు ఉంటాయి.

## ఫైనల్‌కోర్సు

ఐసీడబ్ల్యూఏఐ ఇంటర్మీడియెట్ పాసైనవాళ్లు ఈ కోర్సుకు అర్హులు. ఒక్కోదానిలో నాలుగు పేపర్ల చొప్పున రెండు గ్రూపులు (గ్రూప్-3, గ్రూప్-4)ఉంటాయి.

**గ్రూప్-3..**

ఇందులో కాపిటల్ మార్కెట్ అనాలసిస్ అండ్ కార్పొరేట్‌లాస్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంటర్నే షనల్ ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఇన్‌డైరెక్ట్ అండ్ డైరక్ట్ టాక్స్ మేనేజ్ మెంట్ సబ్జెక్టులుంటాయి.

**గ్రూప్-4..**

ఇందులో మేనేజ్‌మెంట్ అకౌంటింగ్-ఎంటర్‌ప్రైజ్ పెర్‌ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్, అడ్వాన్స్‌డ్ ఫైనాన్షియల్ అకౌంటింగ్ అండ్ రిపోర్టింగ్, కాస్ట్ అడిట్ అండ్ ఆపరేషనల్ ఆడిట్ అండ్ ఎథిక్స్, బిజినెస్ వాల్యుయేషన్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టులుంటాయి.

## కోర్సు పూర్తి చేస్తే..

దశాబ్దం క్రితం వరకూ కాస్ట్ అకౌంటెన్సీ ఉత్తీర్ణులకు మైనింగ్, సిమెంట్, జూట్ వంటి ప్రొడక్షన్ యూనిట్లు మాత్రమే కెరీర్ ఎవెన్యూస్‌గా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి మారింది. సర్వీస్ సెక్టార్, సాఫ్ట్‌వేర్ రంగం, ఎఫ్‌ఎంసీజీ... ఇలా ప్రతిచోటా ఐసీడబ్ల్యూఏ విద్యార్థులకు అవకాశాలు ఆహ్వానం పలుకుతున్నాయి. మేనే జింగ్ డైరెక్టర్, ఫైనాన్స్ డైరెక్టర్, ఫైనాన్షియల్ కంట్రోలర్, చీఫ్ అకౌంటెంట్, కాస్ట్ కంట్రోలర్, మార్కెటింగ్ మేనేజర్, చీఫ్ ఇంటర్నల్ ఆడిటర్ స్థాయికి ఎదిగే అవకాశాలు కూడా ఉంటాయి. సొంతంగా కన్సల్టెన్సీ లను ప్రారంభించుకోవచ్చు. అర్హత, శిక్షణ నైపుణ్యం, అనుభవం గల కాస్ట్ అకౌంటెంట్లకు ఎంతో డిమాండ్ ఉంది. వీరికి అవకాశం కల్పించేందుకు ఎన్నో సంస్థలు ఎదురు చూస్తున్నాయి. అకౌంటెన్సీ నిపుణులను తయారు చేసేపనిలో ఉన్న మరెన్నో విశ్వవిద్యాలయాలు, ప్రముఖ విద్యాసంస్థలు వీరికి పెద్ద మొత్తాల్లో జీతాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయి.

## కాస్ట్ అకౌంటెంట్లు ఏం చేస్తారు

కంపెనీకి సంబంధించిన మొత్తం ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్‌ను సేకరించి విశ్లేషిస్తారు. వీరిచ్చే సమాచారం ఆధారంగానే కంపెనీ మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ముడిసరుకు ధర, లేబర్ కాస్ట్, ట్రాన్స్‌పోర్ట్ కాస్ట్ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రతిపాదిత ప్రాజెక్టును కాస్ట్ అకౌంటెంట్‌ను విశ్లేషిస్తారు.

## అవకాశాలు

ఐసీడబ్ల్యూఏఐ చేసినవారు కంపెనీల్లో కాస్ట్ అకౌంటింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, ఆడిటింగ్, ఇంట ర్నల్ ఆడిటింగ్, సిస్టమ్స్ ఎనాలిసిస్ అండ్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్, ప్రాసెస్ అనాలసిస్, మేనేజ్‌మెంట్

రంగాల్లో చేరవచ్చు. సొంతంగా కన్సల్టెన్సీ ప్రారంభించుకోవచ్చు. ముఖ్యంగా షుగర్, పేపర్, రిఫ్రిజిరేటర్స్, సిమెంట్ అండ్ స్టీల్ కంపెనీల్లో కాస్ట్ అకౌంటెంట్లకు అవకాశాలు అపారం.

## వేతనం

కొత్తగా కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెంట్‌గా నియామకం అయినవారు ఆరు లక్షల రూపాయల వరకు వార్షిక వేతనం పొందుతున్నారు. తర్వాత ప్రతిభ ఆధారంగా కెరీర్‌లో ఎక్కువ మొత్తంలో వేతనం అందుకోవచ్చు. ఆర్థిక మాంధ్యం నేపథ్యంలోనూ గత సంవత్సరం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ 4-6 లక్షల వరకు జీతాలు లభించాయి.

## స్కిల్స్

- క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ అవసరం
- ఫైనాన్స్‌పై ఆసక్తి ఉండాలి
- విశ్లేషణాత్మక నైపుణ్యాలు అవసరం
- మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలి

## ఇన్‌స్టిట్యూట్‌లు

- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా.
  దీని ప్రధాన కేంద్రం కోల్‌కతాలో ఉంది. దానితో పాటు నాలుగు రీజినల్ సెంటర్లు కూడా ఉన్నాయి.
  వెబ్‌సైట్: www.icwai.org
- ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ, ఐసీడబ్ల్యూఏఐ కోర్సుకు దరఖాస్తు చేసుకున్నవారి కోసం స్పెషల్ బీకామ్, ఎంకామ్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తోంది.

### సర్టిఫికెట్ ఇన్ అకౌంటింగ్ టెక్నీషియన్స్ (క్యాట్)

గ్రామీణ యువత లక్ష్యంగా ఐసీడబ్ల్యూఏఐ ఒక సంవత్సరం కాల వ్యవధిగల సర్టిఫికెట్ ఇన్ అకౌంటింగ్ టెక్నీషియన్ కోర్సును ప్రవేశ పెట్టింది. వివిధ కంపెనీల్లో, సంస్థల్లో విభిన్న వాతావరణాల్లో అకౌంటెట్లు సమర్థంగా ఎలా పని చేయాలో క్లాసులో నేర్చుకున్న థియరీని విధులకు ఏ విధంగా వర్తింపజేయాలో ఇందులో తెలియజేస్తారు. అకౌంటింగ్‌లో మెలకువలు నేర్చుకోవడానికి ఆన్ జాబ్ అనుభవాన్ని ఈ కోర్సులో అందిస్తారు.

## సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏ విద్యార్థులు క్రమ పద్ధతిలో చదవాలి..

చార్టెడ్ అకౌంటెంట్(సీఏ), కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెంట్స్, కంపెనీ సెక్రటరీ (సీఎస్) కోర్సులను

ఎంచుకునే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ కోర్సుల్లో మంచి ర్యాంకులు సాధించిన వారి వద్దకే అవకాశాలు వెతుక్కుంటూ వస్తోండటమే దీనికి కారణం. ప్రతి సంస్థకూ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వెన్నెముక లాంటిది. ఆ విభాగంతో పాటు కంపెనీని సమర్థంగా నిర్వహించాలంటే ఆయా కోర్సులు పూర్తి చేసిన నిపుణుల పాత్ర కీలకం. దేశంలో సుమారు లక్షా అరవై వేల మంది సీఏలు మాత్రమే ఉన్నారు. మార్కెట్ అవసరాలతో పోల్చితే వారి సంఖ్య చాలా తక్కువ. కనుక మార్కెట్‌లో ఈ కోర్సులు పూర్తి చేసినవారికి డిమాండ్ పెరుగుతోంది. ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులకు దీటుగా సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏఐ పూర్తిచేసిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ కోర్సులకు ఒక్కో ఇన్‌స్టిట్యూట్ మాత్రమే ఉంది. కోర్సును పూర్తి చేసినవారికి ఆయా ఇన్‌స్టిట్యూట్‌లు సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఎస్‌లుగా గుర్తింపునిస్తాయి. ప్రారంభ వేతనం కనీసం 50 వేలు పొందవచ్చు.

### సీఏలో చేరాలనుకునేవారు...

సీఏ కోర్సునభ్యసించాలనుకునే వారు సొంత ఇష్టం మేరకే కోర్సును ఎంచుకోవాలి. మొదట్నుంచీ క్రమ పద్ధతిలో చదవాలి.

అన్ని సబ్జెక్టులు ఒక్కసారే చివరగా చదువుతానంటే కుదరదు. బిజినెస్ నేపథ్యం ఉన్నవారు ఈ కోర్సుల్లో మెరుగ్గా రాణించవచ్చు. ఇంగ్లిష్ సమస్య పెద్దగా ఉండదు కాబట్టి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ఎక్కువగా రాణిస్తున్నారు.